# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

సోమవారం | 20 జులై, 2026 | పేజీలు : 06


## ఉపాధ్యాయుల నిర్లక్ష్యం.. విద్యార్థుల భవిష్యత్తు అంధకారం!






వివరాలు మెయిన్‌లో...

## జగిత్యాల సమగ్రాభివృద్ధే లక్ష్యం



వివరాలు మెయిన్‌లో...

## వర్షాలు కురవాలని వరుణయాగం



వివరాలు మెయిన్‌లో...

## ప్రారంభమైన వరి నాట్లు



**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలో వరినాట్లు ప్రారంభమయ్యాయి. మోర్తాడ్ మండలంలోని వడ్యాట్, దొన్‌పాల్, సుంకెట్, గాండ్లపేట్, ధర్మోరా, శెట్పల్లి, పాలెం, తిమ్మాపూర్ తదితర గ్రామాలతో పాటు మండల కేంద్రంలో సైతం రైతులు వరినాట్లు వేయడం ప్రారంభించారు. సమయానికి వర్షాలు పడకున్నా కానీ బోర్ల పై ఆధారపడి ఉన్నా రైతులు వరి నాట్లు వేస్తున్నారు. వర్షాలు కురవని ఏడల బోర్లు ఎత్తిపోయే ప్రమాదం సైతం ఉంది. ఏది ఏమైనా నార్లు పోసి నెల రోజులు అయిపోతుండటంతో నారు ముదిరిపోతుండటాన్ని దృష్టిలో పెట్టుకొని కొంతమంది రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో వరి నాట్లు వేయడం ప్రారంభించారు. కొద్దిగా వెనుక ముందు రోజులైనప్పటికీ తప్పనిసరిగా వర్షాలు పడతాయని రైతులు వరుణ దేవుడిపై నమ్మకంతో ఉన్నామని రైతన్నలు తెలిపారు. ఇకపోతే ఆయా గ్రామాలలో ఉన్న చెరువులపై ఆధారపడ్డా రైతులు చెరువులలో నీటి కొరత వలన వరినాట్లు వేయడానికి వెనుక ముందు అవుతున్నారు. వర్షాలు పడితే తప్పనిసరిగా చెరువులు నిండుతాయని అప్పుడు తప్పనిసరిగా ఆయకట్టు కింద ఉన్న రైతులు వరినాట్లు వేస్తామని తెలిపారు. ఏది ఏమైనా వర్షాలు పడితేనే పంటలు పండటమే కాకుండా ప్రజలు కూడా ఆయురారోగ్యాలతో ఉంటామని అంటున్నారు.

## ‘ఎల్‌నినో’ ప్రభావాన్ని సమష్టిగా ఎదుర్కొందాం



వివరాలు మెయిన్‌లో...

## గుండ్లపల్లిలో వారసంత లేక ఇబ్బందులు

**ప్రజాపక్షం / గన్నేరువరం :** గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లి రహదారిపై ఆదివారం వచ్చిందంటే వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుండ్లపల్లి గ్రామంలో వారసంత లేకపోవడంతో రైతులు అన్ని రకాల కూరగాయలు, పండ్లు అమ్ముకునే రైతులు రోడ్డుకు ఇరువైపులా వారసంత నిర్వహిస్తున్నారు. దీంతో గుండ్లపల్లి నుంచి గన్నేరువరం వచ్చే వాహనాలకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారులపై అక్రమంగా బండ్లు తాత్కాలిక షాపులు పెట్టి వ్యాపారం చేసుకునేవారి సంఖ్య రోజురోజుకు పెరగడంతో వాహనదారులకు పెద్ద తలనొప్పిగా మారుతుంది. రోడ్లపై వ్యాపారుల వల్ల పరిస్థితి మరింత కష్టంగా మారుతుందని దీనిపై సంబంధిత అధికారులు కఠినంగా వ్యవహరించాలని వాహనదారులు కోరుతున్నారు.

## జువ్వాడి చొక్కారావు జయంతి వేడుకలు

**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :** స్వర్గీయ జువ్వాడి చొక్కారావు జయంతి వేడుకలు ఆదివారం కరీంనగర్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరై జువ్వాడి చొక్కరావు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాంలో స్వర్గీయ జువ్వాడి చొక్కారావు రాష్ట్రానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆ మాహనీయుడు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## అనుమతులు లేకుండా ఇసుక తరలింపు

**ప్రజాపక్షం/గన్నేరువరం:** గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లి ఎక్స్‌రోడ్ సమీపంలో తిమ్మాపూర్ మండలం రేణిగుంట వాగు నుంచి ఏలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తూ సిద్దిపేట వైపు వెళ్తున్న బోలెరో (పికప్) వాహనాన్ని గన్నేరువరం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని గన్నేరువరం పోలీస్ స్టేషన్ కు తరలించి సంబంధిత నిబంధనల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గన్నేరువరం ఎస్సై జి.నరేందర్ రెడ్డి తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేపట్టేవారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఎస్ఐ తెలిపారు.

# మానవ సేవే ధ్యేయం

**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :** కరీంనగర్ ఆదర్శనగర్ రోడ్ నం.1 శివాలయం ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన లక్ష్ ఫౌండేషన్ హాస్పిటల్ ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ప్రముక విద్యావేత్త, సామాజిక సేవకుడు డా.మొహమ్మద్ ముస్తాక్ అలీ ఆధ్వర్యంలో స్థాపించబడిన ఈ ఆసుపత్రి మానవ సేవే ధ్యేయం అనే లక్ష్యంతో ప్రజలకు అంకితం చేయబడింది. ప్రస్తుత కాలంలో వైద్య చికిత్సలు సామాన్య ప్రజలకు భారంగా మారుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరికీ అందుబాటు ధరలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ ఆసుపత్రిని ప్రారంభించారు. ఆసుపత్రిలో ఔట్‌పేషంట్ ఫీజు కేవలం రూ.50 మాత్రమే నిర్ణయించారు. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జనరల్ ఫిజీషియన్ సేవలు, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రతిరోజు ఒక స్పెషలిస్ట్ వైద్యుడి సేవలు అందించనున్నారు. ఈ సందర్భంగా డా.మొహమ్మద్ ముస్తాక్ అలీ మాట్లాడుతూ ఈ ఆసుపత్రి లాభాపేక్షతో కాకుండా ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ప్రారంభించబడిందని తెలిపారు. సమాజానికి సేవ చేయడమే నిజమైన విజయమని, పేద, మధ్య తరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యమని అన్నారు. లక్ష్ ఫౌండేషన్ గత అనేక సంవత్సరాలుగా సామాజిక సేవలో విశేష కృషి చేస్తుందని కోరుట్లలో ఉచిత గ్రంథాలయం ఏర్పాటు చేశామని ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకోవడం, రక్తదాన శిబిరాలు నిర్వహించడం, ఉద్యోగ మేళాలు నిర్వహించడం తోపాటు విద్య, ఆరోగ్య రంగాల్లో పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం ద్వారా వేలాదిమందికి సేవలందించామని తెలిపారు. కార్పొరేటర్లు సోమిడి వేణుప్రసాద్, జమ్ము, నవీన్, కో కార్పోరేటర్ ఇక్రామ్, అక్రమ్ అలీ, ఫజల్ ఉద్దీన్, బషీర్, ఫైసల్, జమాత్ ఏ ఇస్లామీ హింద్ అధ్యక్షుడు సోహైబ్, అజ్హర్, దబీల్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ తదితరులు పాల్గొన్నారు.

## ఎఎంసి డైరెక్టర్ తండ్రికి కాంగ్రెస్ నాయకుల పరామర్శ

**ప్రజాపక్షం /పెగడపల్లి :** మండలంలోని శాలపల్లి అనుబంధ గ్రామమైన అడపపల్లికి చెందిన వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆడప తిరుపతి తండ్రి హన్మయ్య గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు.ఈ విషయం తెలుసుకున్న పెగడపల్లి మండల కాంగ్రెస్ నాయకులు ఆదివారం అడపపల్లిలోని వారి నివాసానికి వెళ్లి హన్మయ్యను పరామర్శించారు. ఈ సందర్భంగా నాయకులు హన్మయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని,ఆయనకు ధైర్యం చెప్పారు.భవిష్యత్తులో వారి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.హన్మయ్యకు మెరుగైన వైద్య చికిత్స అందించడం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు సూచించారు. వారి సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వం తరపున ఆ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.అలాగే వ్యక్తిగతంగానూ ఆర్థిక సహాయం అందిస్తామని నాయకులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కడారి తిరుపతి, సర్పంచులు సంధి రాజమణి మల్లారెడ్డి, బండారి మనేమ్మ శ్రీనివాస్, రమేష్ నాయక్, మాజీ ఎంపీటీసీ సభ్యులు పూసాల శోభ తిరుపతి, ఉప సర్పంచ్ కుంచె రాజేందర్, ఏఎంసీ డైరెక్టర్లు లింగంపెల్లి మహేష్, చాట్ల భాస్కర్, మాజీ సర్పంచ్ రవి నాయక్,స్థానిక కాంగ్రెస్ నాయకులు తడగొండ రాజు,అడుప సురేష్,మారుతి,తదితరులు పాల్గొన్నారు.



## నిరుపేదలకు సిఎంఆర్‌ఎఫ్ ఎంతో మేలు

### సిరిసిల్ల కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సూర దేవరాజు

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో మేలు చేకూరుస్తుందని సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సూర దేవరాజు కొనియాడారు. ఆదివారం సిరిసిల్ల పట్టణంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన చేతుల మీదుగా అందజేశారు. పట్టణానికి చెందిన సుల్తాన్ లచ్చయ్య 60,00 రూపాయలు, మద్దిరాల ప్రతాప్ కు 17500 సదుల లలిత 26000 రూపాయల విలువైన చెక్కులను లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక గొప్ప సంక్షేమ పథకమని అన్నారు. తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తూ, పేద బడుగు బలహీన వర్గాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకే సిలిండర్, 200 యూనిట్ వరకు కరెంట్ బిల్లు ఉచితం అర్హులైన ప్రతి ఒక్కరికి సన్న బియ్యం, రైతులకు గిట్టుబాటు ధర లాంటి అనేక సంక్షేమాలు అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీది అన్నారు. ఈ కార్యక్రమంలో సూర నిర్మల, కోడం నాగభూషణం, కత్తెరపాక ఎల్లయ్య, కోలకని రాజేశం, అనవేని మల్లేశం,తడుక వెంకటేశం, సదుల గంగాధర్, ఎండి కలీం, అబ్బగోని లచ్చయ్య పాల్గొన్నారు.



## గ్రామదేవతలకు మొక్కులు చెల్లించిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు

**కొమిరెడ్డి కరంచంద్ ప్రజాపక్షం /మెట్‌పల్లి :** ఆషాడ మాసం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, సుప్రీంకోర్టు న్యాయవాది కొమిరెడ్డి కరంచంద్, అంతర్జాతీయ జర్నలిస్ట్ కొమిరెడ్డి కపిల్ మరియు వారి కుటుంబ సభ్యులు గ్రామదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.ఇటీవల లండన్ నుంచి స్వగ్రామానికి వచ్చిన అంతర్జాతీయ జర్నలిస్ట్ కొమిరెడ్డి కపిల్, లండన్‌కు చెందిన ప్రముఖ వైద్యురాలు డా. కొమిరెడ్డి క్లియో,కుటుంబ సభ్యులు కొమిరెడ్డి రామ్ తదితరులతో కలిసి మెట్‌పల్లి పట్టణంలోని 11వ వార్డు వెంకట్రావుపేట గ్రామదేవత, గడిమైసమ్మ, మహాలక్ష్మి అమ్మవారు, ఇంద్రనగర్ పోచమ్మ తల్లి ఆలయాలను దర్శించుకుని సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు.అనంతరం ఆలయ అర్చకుల ఆశీర్వాదాలు స్వీకరించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

## కనకదుర్గ అమ్మవారికి మహిళల బోనాల సమర్పణ

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మండల కేంద్రంలోని శ్రీ కనక దుర్గ అమ్మవారి ఆలయంలో ఆషాడ మాసం సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారికి బోనాలను సమర్పించారు.మహిళలు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక నైవేద్యాలు వండుకొని నెత్తిన బోనం ఎత్తుకొని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి బోనాలను సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు.కాగా గ్రామ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్ 25వేల రూపాయల నగదును,సీనియర్ పాత్రికేయుడు రాంప్రసాద్ రజనీ దంపతులు 5000 రూపాయల నగదును అమ్మవారి ఆలయానికి విరాళంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్, ఉప సర్పంచ్ గడ్డం సోమారెడ్డి, బిజెపి మండలాధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్ రెడ్డి, కమిటీ సభ్యులు రామ గౌడ్ లక్ష్మి రెడ్డి రవీందర్ మారుతి, వార్డు సభ్యులు లతా చంద్రయ్య లావణ్య , సామాజిక కార్యకర్త ఏనుగు వెంకట్ రెడ్డి,గ్రామ ప్రజా ప్రతినిధులు,మహిళా భక్తులు,తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యా సామాగ్రి అందజేసిన స్వచ్ఛంద సంస్థ

**ప్రజా పక్షం /మల్యాల :** విద్యార్థుల్లో విద్యాపట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఫాతిమానగర్ అడోరేషన్ సొసైటీ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేటలో ఏర్పాటు చేసిన ట్యూషన్ సెంటర్‌లో చదువుతున్న 30 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు,పెన్సిళ్లు, రబ్బర్లు,చాక్ బాక్స్‌లను ఆదివారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ సిస్టర్ జిసా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అవసరమైన విద్యా సహాయాన్ని అందించడం సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అనంతరం సిస్టర్ జాయిస్, లీనా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మర్రి మల్లేశం,శ్రీనివాస్ రెడ్డి,రమేష్, మౌనిక,జమున,గంగా,తదితరులు పాల్గొన్నారు.

## చిల్వాకోడూర్‌లో పోచమ్మ బోనాలు

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలో చిల్వాకోడూర్ గ్రామంలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో గ్రామదేవత పోచమ్మ తల్లి బోనాలు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఇంటిలో ప్రత్యేకంగా తయారు చేసిన బోనాన్ని (అన్నం ,బెల్లం ,పాలు )ఇంటి నుండి కుటుంబ సమేతంగా మహిళలు తలపై నెత్తిన బోనాలు పెట్టుకొని భక్త శ్రద్ధలతో డప్పు చప్పుళ్ల మధ్య సంఘ సభ్యులు యువకులు గ్రామ ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా సమీపంలో గల పోచమ్మ ఆలయానికి చేరుకున్నారు . అనంతరం అమ్మవారికి పసుపు ,కుంకుమ చల్లి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు .తమ కుటుంబం క్షేమంగా ఉండాలని వర్షాలు సమృద్ధిగా కురవాలని ,పాడి పంటలు బాగా పండాలని అందరూ సుఖశాంతులతో జీవించాలని అమ్మవారిని వేడుకున్నారు .ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురిసి ,పాడి ,పశు సంపదతో గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతూ పోచమ్మ తల్లికి నైవేద్యం ,ఒడి బియ్యం సమర్పించడం జరిగిందని తెలిపారు .ఈ కార్యక్రమంలో కందుకూరి మహేందర్ శివ,సత్యలక్ష్మి ,నేరెళ్ల సాయి ,మౌనిక , కందుకూరి శ్రీనివాస్ , లావణ్య , సుధాకర్ వాణి ,కందుకూరి అమ్మాయి ,గందె పరంధాములు సాయి ,కల ,గందె వేణు సంతోష ,గందె భాస్కర్ లత సంఘ సభ్యులు యువకులు మహిళలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతలను దోపిడీ చేస్తున్నవారిపై కేసులు నమోదు

### సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి

**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :** జిల్లావ్యాప్తంగా అన్నదాతలను ఆర్థికంగా మోసం చేస్తూ పెద్దఎత్తున దోపిడి చేస్తున్న సీడ్ ప్రొడ్యూసర్స్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేసి రైతాంగానికి న్యాయంగా ఒప్పందం ప్రకారం డబ్బులు ఇప్పించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఎం కార్యాలయం ముకుందలాల్ మిశ్రా భవన్‌లో సిపిఎం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆయన వెల్లడించారు. జిల్లాలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి భవిష్యత్ కార్యాచరణను ప్రకటించారు. జిల్లాలో పెద్దఎత్తున రైతులు వరి విత్తనాలు ఉత్పత్తి చేస్తారని ఉత్పత్తి చేసిన విత్తనాలను సీడ్ ప్లాంట్లకు విక్రయిస్తారని అన్నారు. సీడ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ యజమానలు రైతులతో చేసుకున్న ఒప్పందాల ప్రకారం కాకుండా ధరలు తగ్గిస్తూ వారిని మోసం చేయడం సరి కాదన్నారు. 2025లో చేసుకున్న ఒప్పందాన్ని తుంగలో తొక్కి మరో అగ్రిమెంట్ రాసుకున్నారని అన్నారు. ప్రతి సంవత్సరం రైతుల నుంచి తరుగు పేరుతో తూకం పేరుతో, సంచి బరువు పేరుతో ఒక్కో బస్తాకు రెండున్నర కిలోల కోతలు విధిస్తూ కోట్ల రూపాయలు అక్రమంగా గడిస్తున్న యజమానులపై నాన్ బెలేబుల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. యజమానులు చేస్తున్న మోసాలను రైతులు ప్రశ్నిస్తే వారిని అవమానిస్తూ బెదిరిస్తున్నారని మండిపడ్డారు. జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులు సీడ్ ప్లాంట్ల యజమానులపై చట్టరిత్యా చర్యలు తీసుకొని రైతాంగానికి న్యాయమైన ఒప్పందం మేరకు డబ్బులు ఇప్పించాలని లేనిపక్షంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా దశలవారిగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. మరోవైపు జ్లిలావ్యాప్తంగా కరువు పరిస్థితులు ఏర్పడ్డ నేపథ్యంలో సాగునీరు అదించడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని మండి పడ్డారు. కన్నెపలి నుంచి అన్నారం బ్యారెజ్‌కి నీటిని లిఫ్ట్ చేయడానికి అవకాశం ఉందని దీంతో ప్రజల సాగు, తాగునీరు సమస్య తీరుతుందన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా సభ్యులు వర్ణ వెంకట్ రెడ్డి, జి.భీమాసాహెబ్, ఉప్పునూటి శ్రీనివాస్ సుంకర సంపత్, ఎడ్ల రమేశ్, జి.రాజేశం, కొప్పుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డు లబ్ధిదారులు ఇ-కెవైసి పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/సిర్పూర్ టీ:** రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులందరూ తప్పనిసరిగా నిర్ణీత గడువులోగా ఈకెవైసి నమోదు పూర్తి చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తాహసీల్దార్ రాజ్‌కుమార్ సూచించారు. ఆదివారం సిర్పూర్ టీ గ్రామంలోని రేషన్ షాప్ నంబర్ 2410001 నందు లబ్ధిదారులకు ఈకెవైసి ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ సిర్పూర్ టీ మండలంలో ఇంకా 5898 మంది ఇకెవైసి చేసుకోలేదని తెలిపారు. ఈకేవైసీ చేయించుకోకపోతే రేషన్ కార్డు నుండి లబ్ధిదారుల పేర్లు తొలగించే అవకాశం ఉందన్నారు. ఆధార్, రేషన్ కార్డుల అనుసంధానం ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థ మరింత పారదర్శకంగా మారుతుందని, నకిలీ లబ్ధిదారుల నివారణతో పాటు అర్హులైన ప్రతి కుటుంబానికి ఆహార భద్రత పథకాలు సకాలంలో అందుతాయని వివరించారు. ప్రజలు పూర్తి సహకారం అందించి సమీప రేషన్ దుకాణాల్లో ఈ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

## విర్దండి గ్రామంలో కొమురం భీం కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/కౌటాల:** మండలంలోని విర్దండి గ్రామంలో ఆదివారం కొమురం భీం నూతన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడు తలాండే దిలీప్, మండల ఉపాధ్యక్షుడు పర్చాకే బండు అధ్యక్షతన గ్రామ ప్రజలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఈ కమిటీని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కొమురం భీం ఆశయాల సాధనకు, ఆదివాసీల హక్కుల పరిరక్షణకు, గ్రామ అభివృద్ధికి నూతన కమిటీ ఐక్యంగా కృషి చేయాలని కోరారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కోడపే ఉమాజీ, ఉపాధ్యక్షుడి గా మడావి సునీల్, కార్యదర్శిగా పెందూర్ హనుమంతు, ప్రధాన కార్యదర్శిగా మడావి సంపత్, కోశాధికారిగా ఆత్రం బావుజి, ప్రచార కార్యదర్శిగా మడావి వినోద్, సంయుక్త కార్యదర్శిగా పెందూర్ ఈశ్వర్ ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కమిటీ సభ్యులకు గ్రామస్తులు, సంఘం నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

## శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

**ప్రజాపక్షం/కేరమేరి :** మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక కృషి చేస్తానని కేరమేరి నూతన సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ తెలిపారు. కేరమేరి పోలీసు స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యక్రమాలు, జూదం, అక్రమ మద్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటానన్నారు. కాగా నూతన సబ్ తఇన్‌స్పెక్టర్‌కు కేరమేరి పోలీసు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## ఎంఎల్ఎ వెడ్మ బొజ్జు బహిరంగ క్షమాపణ చెప్పాలి



**ప్రజాపక్షం/జన్నారం:** మీడియాపై శాసనసభ్యుడు బొజ్జు పటేల్ చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని బిఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు గుర్రం రాజారాం రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం జన్నారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ భవనంలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్రం రాజారాం రెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ గురించి మాట్లాడే స్థాయి శాసనసభ్యుడికి లేదన్నారు. ఇకపై బిఆర్ఎస్ పార్టీపై ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే తగిన విధంగా సమాధానం చెబుతామని హెచ్చరించారు. జన్నారం మండలం పరిసర ప్రాంతాల్లో ఇసుక కొరత కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నియోజకవర్గ ప్రజాప్రతినిధిగా ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ఆయన విఫలమవుతున్నారని విమర్శించారు. అటవీ శాఖ అధికారులు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని, ఇసుక సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు మున్వర్ అలీ ఖాన్, భరత్, చెట్టుపల్లి సత్యం, రాములు నాయక్, శ్రీనివాస్ గౌడ్, జాడి గంగాధర్, పేరం శ్రీనివాస్, కళ్లెం శ్రీనివాస్ రెడ్డి, ప్రేమ్ సాగర్, ఇప్ప రాకేష్, బాదవత్ సాయికిరణ్, ఇప్ప మహేష్, అప్పని సాయి, దుమ్మల ఎల్లయ్య, బచ్చల శివ, ఇళ్లవేణి రవి పాల్గొన్నారు.

## పట్టాలున్న రైతులను అడ్డుకోవడం అన్యాయం



**ప్రజాపక్షం/కాగజ్ నగర్:** ప్రభుత్వం ఇచ్చిన లావుని పట్టాలు కలిగి ఉండి, దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న రైతులను అటవీ శాఖ అధికారులు అడ్డుకోవడం అన్యాయమని సిర్పూర్ శాసనసభ్యుడు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు అన్నారు. కాగజ్ నగర్ మండలం అంకుసాపూర్ శివారు సర్వే నంబర్ 145 లో అటవీ అధికారులు అడ్డుకున్న భూముల్లో రైతులకు సంఘీభావంగా ఆదివారం ఆయన స్వయంగా నాగలి పట్టి భూమిని దున్ని పత్తి విత్తనాలు వేశారు. ఈ సందర్భంగా పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ అంకుసాపూర్ శివారులోని సర్వే నంబర్ 145 లో దాదాపు 30 మంది రైతులకు ప్రభుత్వం గతంలోనే పట్టాలు ఇచ్చిందన్నారు. అప్పటి నుండి సాగు చేసుకుంటున్న భూములపై అటవీ అధికారుల కన్ను పడిందని, తమ భూమి అంటూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వం తరహాలోనే ప్రస్తుత ప్రభుత్వం కూడా రైతుల పట్ల దౌర్జన్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. అంకుసాపూర్ లో పట్టాలున్న రైతుల జోలికి వస్తే సహించేది లేదని అటవీ అధికారులను హెచ్చరించారు. రైతుల హక్కుల కోసం పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మానేపల్లి సత్తయ్య, గొర్రె హనుమంతు, డోంగ్రే కార్తీక్, గ్రామ రైతులు, మహిళలు పాల్గొన్నారు.

## ఒక్క సిసి కెమెరా వంద మంది పోలీసులతో సమానం

### ఎస్ఐ ఉదయ్ కిరణ్



**ప్రజాపక్షం/జన్నారం :** నేర నియంత్రణలో సిసి కెమెరాల పాత్ర అత్యంత కీలకమని జన్నారం సబ్ ఇన్స్పెక్టర్ జి ఉదయ్ కిరణ్ తెలిపారు. జన్నారం మండలం పొన్కల్ గ్రామంలో స్థానిక వ్యాపారులతో నిర్వహించిన ముఖాముఖి సమావేశంలో ఆయన సిసి కెమెరాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ ఒక్క సిసి కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. సిసి కెమెరాల ద్వారా దొంగతనాలు, చోరీలు, గొలుసు దొంగతనాల వంటి ఆస్తి సంబంధిత నేరాలను అరికట్టవచ్చని తెలిపారు. రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన వాస్తవాలను త్వరగా గుర్తించి బాధితులకు న్యాయం చేయడం సులభమవుతుందన్నారు. అసాంఘిక శక్తులు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించి నేరాలను ముందుగానే నివారించవచ్చని, దీనివల్ల మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రత మరింత మెరుగుపడుతుందని వివరించారు. దర్యాప్తులో కీలకమైన సాక్ష్యాలు లభించి నేరస్థులను త్వరితగతిన అరెస్ట్ చేయడానికి ఇవి ఉపయోగపడతాయన్నారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసులకు వేగంగా స్పందించే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రతి వ్యాపార సంస్థ, గృహ యజమాని, అపార్ట్‌మెంట్, విద్యా సంస్థ, ప్రజా ప్రదేశాల్లో నాణ్యమైన సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, వాటిని ఎప్పటికప్పుడు పనిచేసే స్థితిలో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పొన్కల్ గ్రామ వ్యాపారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## మున్నూరు కాపు సంఘం బలోపేతానికి కృషి



**ప్రజా పక్షం/కాగజ్ నగర్ :** మున్నూరు కాపు సంఘం బలోపేతం, సామాజిక అభివృద్ధి, యువతకు విద్యా ఉపాధి అవకాశాల కల్పన కోసం నూతన కార్యవర్గం కృషి చేయాలని కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా మున్నూరు కాపు సం ఘం నూతన అధ్యక్షుడు పెద్దపల్లి కిషన్ రావు పిలుపునిచ్చా రు. కాగజ్ నగర్ పట్టణంలోని వినయ్ గార్డెన్ లో ఆదివా రం జిల్లా మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గ ప్ర మాణ స్వీకార మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ము న్నూరు కాపు కార్పొరేషన్ ఛైర్మన్ బొమ్మ శ్రీరాం చక్రవర్తి పటేల్, శాసన మండలి సభ్యుడు దండే విఠల్ పటేల్, ము న్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుట్టం పురుషోత్తం పటేల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల గ్రంథాల య సంస్థల చైర్మన్లు సత్తు మల్లేష్ పటేల్, మల్లెపూల నర స య్యా పటేల్ హాజరై నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సామాజిక ఐక్యత సాధనే సంఘం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం సంఘ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సమాజ అభ్యున్నతికి తోడ్పడాలని కోరారు. గౌరవ అతిథులుగా మంచిర్యాల పట్టణ మేయర్ ధర్ని మధుకర్ పటేల్, ఆదిలాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ పటేల్, బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దేవా స్వాతి రమేష్ బాబు పటేల్, నిర్మల్ మున్సిపల్ చైర్‌పర్సన్ అప్పాల కావ్య గణేష్ చక్రవర్తి పటేల్ హాజరై నూతన కార్యవర్గాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని కౌటాల, బెజ్జూర్, చింతలమానేపల్లి, సిర్పూర్ టీ, పెంచికల్పేట్, దహెగాం, ఆసిఫాబాద్, రెబ్బెన, తీర్యాని, వాంకిడి, జైనూర్, కెరమెరి, కాగజ్‌నగర్ మండలాలకు చెందిన కులబాంధవులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జగదం సత్యనారాయణ, మణికొండ వెంకటేశం పాల్గొన్నారు.

## డిగ్రీ ప్రవేశాలకు ప్రత్యేక అవకాశం

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్:** ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఇప్పటి వరకు డిగ్రీలో చేరని విద్యార్థులకు ప్రభుత్వం మరోసారి ప్రత్యేక అవకాశం కల్పించినట్లు కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీదేవి తెలిపారు. ఈ నెల 20 నుండి 26 వరకు విద్యార్థులు డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) ద్వారా నమోదు చేసుకొని ప్రవేశాలు పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటర్ ఉత్తీర్ణులై డిగ్రీలో చేరని వారు, ఇప్పటి వరకు ఏ కళాశాలలోనూ సీటు లభించని విద్యార్థులు ఈ చివరి అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం విద్యార్థులు కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి దోస్త్ సహాయ కేంద్రంను సం ప్రదించాలన్నారు. సందేహాల నివృత్తికై 7013607011, 9440194179 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ పరిధిలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## లేబర్ కోడ్లను రద్దు చేయాలి

**ప్రజాపక్షం/కౌటాల:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసి, పాత 44 కార్మిక చట్టాలను యథావిధిగా అమలు చేయాలని ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం కౌటాల మండల కేంద్రంలోని ఉద్యానవనంలో నిర్వహించిన సమావేశంలో ఈ నెల 26న ఆసిఫాబాద్ లో జరిగే సంఘం జిల్లా నాలుగో మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం కల్పించాలని కోరారు. మిషన్ భగీరథ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించి, ప్రతి నెల ఒకటో తేదీన అందేలా చూడాలన్నారు. సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించాలని, మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్, మిషన్ భగీరథ వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## టిఎస్‌జెయు లీగల్ అడ్వైజర్‌గా చిప్ప మనోహర్



**ప్రజాపక్షం/బెల్లంపల్లి:** తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ జిల్లా లీగల్ అడ్వైజర్గా బెల్లంపల్లి పట్టణానికి చెందిన చిప్ప మనోహర్ నియమితులయ్యారు. ఆదివారం బెల్లంపల్లి పట్టణంలో నిర్వహించిన యూనియన్ కార్యవర్గ సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజు పటేల్, కలువల అరుణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో యూనియన్ జర్నలిస్టులు ఎదుర్కొనే లీగల్ సమస్యల పరిష్కారానికి ఆయన పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. జర్నలిస్టులు ఎలాంటి చట్టపరమైన ఇబ్బందులు ఉన్నా ఆయన సేవలను వినియోగించుకోవచ్చని సూచించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి జిల్లా, రాష్ట్ర యూనియన్ నాయకత్వం ఎల్లప్పుడు ముందుంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బి వెంకటేష్, నాయకులు ఎన్ సంతోష్, ఎన్ శ్రీకాంత్ గౌడ్, పి సాయికుమార్, ఈ తిరుపతి, ఇంతియాజ్, డి వెంకటేష్, బొద్దున సతీష్ పాల్గొన్నారు.

## ఆలయ పునర్నిర్మాణానికి ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/దండేపల్లి:** మండలంలోని కొత్త మామిడిపల్లి గ్రామ పంచాయతీ పరిధి దమ్మన్నపేట గ్రామంలో వెలిసిన ఆదివాసీ నాయకపోడుల ఆరాధ్య దైవం పశులయ్య ఆలయ పునర్నిర్మాణానికి మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ నాయకుడు గడ్డం త్రిమూర్తి రూ.21 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ విరాళంతో నిర్మించిన గుడిలో ఆదివారం కొత్త మామిడిపల్లి గ్రామస్థులు, దమ్మన్నపేట ఆదివాసులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కస్తూరి చిన్న పోషం, ఉప సర్పంచ్ గడ్డం శ్రీనివాస్ మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో ఉన్న ఈ గుడి ప్రతి వేసవి కాలంలో అగ్నికి ఆహుతి అయి కాలిపోయేదన్నారు. ఈ విషయాన్ని గడ్డం త్రిమూర్తికి వివరించగా స్పందించి ఆలయ శాశ్వత పునర్నిర్మాణానికి రూ.21 వేల ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో ఎప్పుడు వర్షభావ పరిస్థితులు ఏర్పడి కరువు వచ్చినా పశులయ్య దేవునికి పూజలు చేస్తే సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలు పండుతాయని ప్రజల నమ్మకమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అక్కల కృష్ణ, బిళ్ళకోరి మల్లేష్, తిరుపతి, బాలు, ఆలయ పూజారి ఎల్లయ్య, భీమయ్య, స్థానిక గ్రామస్థులు పాల్గొన్నారు.

## కంకాలమ్మ గుట్టపై ప్రత్యేక పూజలు

**ప్రజాపక్షం/కౌటాల:** సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ తల్లోడి గ్రామ మహిళలు, రైతులు ఆదివారం కౌటాల మండల కేంద్రంలోని స్వయంభు శ్రీ కంకాలమ్మ గుట్టపై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి జలాభిషేకం చేసి, గుట్ట చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. సకాలంలో వర్షాలు కురిసి ఈ ఏడాది వ్యవసాయ పనులు సాఫీగా సాగాలని రైతులు ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో తల్లోడి గ్రామానికి చెందిన మహిళలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

**ప్రజాపక్షం/ఖానాపూర్ రూరల్:** ఖానాపూర్ మండలంలోని ఎర్వచింతల్ గ్రామంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోడారి రాజమణి అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన భార్యాభర్తలు కోడారి రాజమణి రాజేశ్వర్ లు తమ తోటలో వ్యవసాయ పనుల కోసం బైక్ మీద బయలుదేరారు.ఈ క్రమంలో గ్రామం నుంచి కొలాంగూడ గ్రామం వైపు వెళ్తున్న కంకర టిప్పర్ ను ఓవర్ చేస్తున్న క్రమంలో బైక్ అదుపుతప్పింది.దీంతో కోడారి రాజమణి టిప్పర్ వెనుక చక్రాల కింద పడటంతో ఆమెకు తీవ్ర గాయలవడంతో పాటు కుడికాలు నుజ్జునుజ్జు అయింది. గ్రామస్థులు బాధితురాలిని అంబులెన్స్ లో హుటాహుటిన మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. భర్త స్వల్ప గాయాలతో బయటపడగా ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు డ్రైవర్ ను అదుపులోకి తీసుకుని కంకర టిప్పర్ ను స్టేషన్ కి తరలించారు.

## పసిపిల్లల ఆరోగ్య దృశ్య తొలిముద్ద కార్యక్రమం



**ప్రజాపక్షం/బోథ్:** రాష్ట్ర ప్రభుత్వంఅంగన్వాడీ కేంద్రాల ద్వారా అమ్మ చేతి తొలి ముద్ద కార్యక్రమాన్ని అమలు చేయడం వల్ల పసిపిల్లలకు పౌష్టికాహారం అందడంతో పాటు ఆరోగ్యంగా ఉంటారని పలువురు వార్డు సభ్యులు పేర్కొన్నారు.ఆదివారం బోథ్ మండల కేంద్రంలోని ఆరవ అంగన్వాడీ కేంద్రంలోకార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వార్డు సభ్యులు బారే ఐశ్వర్య ,కటుకూరి సాయి కరిపే శ్రీనివాస్ కట్ట భూమేష్లు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలిముద్దవల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. అంగన్వాడి కేంద్రాలు పరిశుభ్రంగా ఉంచాలని విద్యార్థులకు ఇబ్బందులు కలగ కుండ కేంద్రాల నిర్వహణ ఉండాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ వసంత,ఏఎన్ఎం ఆశ వర్కర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలి



**ప్రజాపక్షం/సిర్పూర్ టీ:** సిర్పూర్ టీ మండల కేంద్రంలో అనుమతి లేని మార్గాల్లో భారీ వాహనాల రాకపోకలను తక్షణమే నియంత్రించాలని సిర్పూర్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ ఒడ్డెటి నాగమణి డిమాండ్ చేశారు. ఆదివారం ఓ భారీ వాహనం విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో ప్రధాన రహదారిపై ట్రాఫిక్ జామ్ ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న సర్పంచ్ వార్డు సభ్యులతో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి, రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఒడ్డెటి నాగమణి మాట్లాడుతూ గ్రామంలో భారీ వాహనాల రాకపోకలను నియంత్రించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. అనుమతి లేని రోడ్డు మార్గాల్లో భారీ లారీలు, ట్రక్కులు నిరంతరం సంచరిస్తుండటంతో రోడ్లు దెబ్బతినడంతో పాటు ప్రమాదాల ముప్పు పెరుగుతోందన్నారు. గ్రామ ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## గిరిజన సహకార సంస్థ అధికారుల అక్రమాలపై విచారణ









**ప్రజాపక్షం/నిర్మల్/ఆదిలాబాద్ :** గిరిజన సహకార సంస్థ డివిజనల్ మేనేజర్, ఇన్‌చార్జ్ డివిజనల్ మేనేజర్ (హార్టీకల్చర్) గుడిమల్ల సందీప్ కుమార్ ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ తీవ్రమైన అక్రమాలకు పాల్పడుతున్నారని, తక్షణమే ఆయనను విధుల నుండి తొలగించి,శాఖాపరమైన విచారణ జరపాలని తుడుందెబ్బ గిరిజన సంఘం రాష్ట్ర నాయకత్వం తీవ్రస్థాయిలో డిమాండ్ చేసింది.ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు గొడం గణేష్,రాష్ట్ర నాయకులు వెట్టి మనోజ్, అర్క శేషరావు సంయుక్తంగా ఒక అధికారిక పత్రికా ప్రకటనను విడుదల చేశారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలు,వసతిగృహాలలో ఉంటూ విద్యను అభ్యసిస్తున్న నిరుపేద విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అత్యంత నాణ్యమైన,పౌష్టికాహార మెనూ ప్రకారం భోజన వసతి కల్పించాల్సి ఉండగా,ఇక్కడ ఆ నిబంధనలు పూర్తిగా తుంగలో తొక్కబడుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.నాలుగు జిల్లాలకు ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న గిరిజన సహకార సంస్థ డివిజనల్ మేనేజర్ గుడిమల్ల సందీప్ కుమార్ తన అధికార పరిధిని దుర్వినియోగం చేస్తూ, ఐఏఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (ఐటీడీఏ)కళ్ళు గప్పి అక్రమాలకు తెరలేపారని సంఘం నేతలు ఆరోపించారు. టెండర్స్ ప్రొసీడింగ్స్ నివేదికలను సదరు అధికారి స్వయంగా తయారు చేసి, ఉన్నతాధికారులను పూర్తిగా నమ్మించి, వారి ద్వారా తెలియకుండానే ప్రొసీడింగ్ కాపీలపై సంతకాలు చేయించుకొని తీవ్రమైన మోసానికి పాల్పడ్డారని పేర్కొన్నారు. ముఖ్యంగా టెండర్ ప్రక్రియ అంతా అధికారికంగా పూర్తయిన తర్వాత, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, కేవలం తన స్వలాభం కోసం మాత్రమే నాణ్యత లేని శాయం కారం పొడి వంటి సరుకులను ప్రొసీడింగ్స్ జాబితాలో అక్రమంగా చేర్చారని మండిపడ్డారు. .అలా కాకుండా,సదరు అధికారి స్వలాభం ఆశించి ప్రైవేటు కాంట్రాక్టర్లతో, గుత్తేదారులతో లోపాయికారీగా కుమ్మక్కై, మార్కెట్లో అతి తక్కువ ధరకు దొరికే, అత్యంత నాణ్యత లేని కారం పొడిని సరఫరా చేస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు.ఇటువంటి కల్తీ, నాణ్యత లేని ఆహార పదార్థాల సరఫరా వల్ల ఆశ్రమ పాఠశాలల్లో చదువుకునే అమాయకులైన గిరిజన విద్యార్థుల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కావున, గిరిజన విద్యార్థుల భవిష్యత్తును, వారి ఆరోగ్యాన్ని అత్యంత ప్రాధాన్యతగా దృష్టిలో ఉంచుకుని, అవినీతికి పాల్పడిన సదరు జీసీసీ డివిజనల్ మేనేజర్ పై తక్షణమే ఉన్నతస్థాయి శాఖాపరమైన విచారణ జరిపించాలని కోరారు. తక్షణమే ఆయనను విధుల నుండి తొలగించి, సస్పెండ్ చేయడంతో పాటు చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా తుడుందెబ్బ సంఘం తరపున ప్రభుత్వానికి అత్యంత వినమ్రంగా విజ్ఞప్తి చేశారు.

## మొక్కల పరిరక్షణతోనే మానవుల జీవన మనుగడ సాధ్యం



**ప్రజాపక్షం/భైంసా:** మొక్కల పరిరక్షణతోనే మానవజాతి జీవన మనుగడ సాధ్యమని బైంసా పట్టణంలోని నాలుగవ ఆరవ వార్డు కౌన్సిలర్లు అమూల్ చింతపండు మహేష్లు అన్నారు. ఆదివారం రోజు పట్టణంలోని జయశంకర్ విగ్రహం వద్ద అదేవిధంగా గోపాల్ నగర్ లోని హనుమాన్ ఆలయ ఆవరణలో ప్రకృతి పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు.ఈ సందర్భంగా కౌన్సిలర్లను కాలనీవాసులు శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో రాజు పటేల్, డాక్టర్ సాగర్, శంకర్ ,చంద్ర, సతీష్ ,వెంకటేష్, డాక్టర్ మోహన్ ,రవీంద్ర చారి ,అశోక్ చారి, కృష్ణమూర్తి ,దశరథ్ ,అవధూత్ పటేల్, వినాయక పటేల్, గణేష్ లతోపాటు కాలనీవాసులు,తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదిగా ఎంపికైన ఝరి (బి)గ్రామ యువకుడు



**ప్రజాపక్షం/తానూర్ :** మండలంలోని ఝరి(బి)గ్రామాని కి చెందిన యువకుడు యోగేష్ అరుదైన మైలురాయిని అ ధిగమించి ఆదివారం సరికొత్త రికార్డు సృష్టించారు.ఇటీవల వెలువడిన ఫలితాలలో ఆయన ప్రతిష్టాత్మకమైన ఆల్ ఇం డియా బార్ కౌన్సిల్ పరీక్షలో ఘన విజయం సాధించి, అధికారికంగా అడ్వకేట్‌గా ఎంపికయ్యారు.ప్రాథమిక విద్యాభ్యాసం నుండి ఎంతో ప్రతిభావంతుడిగా గుర్తింపు పొం దారు. మొదట ఆయన సాంకేతిక రంగం వైపు అడుగులు వేసి విజయవంతంగా బి.టెక్ డిగ్రీ పూర్తి చేశారు.ఆ తర్వాత సమాజానికి సేవ చేయాలనే బలమైన సంకల్పంతో న్యాయవ్యవస్థపై ఉన్న మక్కువతో ఎల్.ఎల్.బి విద్యను అభ్యసించి పూర్తి చేశారు.న్యాయ విద్య అనంతరం దేశవ్యాప్తంగా నిర్వహించే అత్యంత కఠినమైన ఆల్ ఇండియా బార్ ఎగ్జామినేషన్‌లో ఉత్తీర్ణత సాధించి, బార్ కౌన్సిల్‌లో సభ్యత్వం పొందడం విశేషం.ఒక చిన్న గ్రామం నుండి వచ్చి, అటు సాంకేతిక విద్య , ఇటు న్యాయ విద్య రెండింటిలోనూ రాణించి,నేడు న్యాయవాదిగా అత్యున్నత కౌన్సిల్‌కు ఎంపిక కావడం పట్ల ఝరి బి గ్రామ ప్రజలు, మిత్రులు మరియు శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ విజయం స్థానిక యువతకు ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని గ్రామ పెద్దలు కొనియాడారు.న్యాయాన్ని రక్షించే పవిత్రమైన బాధ్యతతో ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని,సమాజంలో అణగారిన వర్గాలకు అండగా నిలవాలని మండల ప్రజలు,గ్రామస్తులు ఆకాంక్షించారు.

## 'సర్' ప్రక్రియను పరిశీలించిన మాజీ ఎంఎల్ఎ

**ప్రజాపక్షం/తానూర్:** మండల కేంద్రం గ్రామ పంచాయతీ లో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను మాజీ ఎంఎల్ఏ విట్టల్ రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా. ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా,ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. ఓటరు నమోదు సమయంలో ఎదురవుతున్న సమస్యలను జీపీఓ,బీఎల్‌వోలు,అడిగి తెలుసుకుని,వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు.అర్హులైన వారంతా ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిపిఓ తేజా, రవి, మాజీ ఎంపీపీ రాజన్న,మాజీ సర్పంచ్ మాధవ్ రావ్ పటేల్,మాజీ జడ్పీటీసీ ఉత్తమ్ భలే రావ్,పోతరెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పవార్ భీమ్ రావ్, గ్రామస్తాలు, తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్‌లో వైభవంగా బోనాల జాతర



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** ప్రకృతిని పరవశింపజేసే ఆషాఢ మాసం రానే వచ్చింది.ఊరూవాడా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.లయబద్ధమైన డప్పు చప్పుళ్లు,శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాల మధ్య నిర్మల్ పట్టణంలో బోనాల పండుగ అత్యంత వైభవంగా ప్రారంభమైంది.ఆదివారం పట్టణంలోని ఏఎన్ రెడ్డి కాలనీకి చెందిన ఏ ఎం ఆర్ అపార్ట్మెంట్ వాసులు భక్తిశ్రద్ధలతో, ఘనంగా బోనాల పండుగను జరుపుకున్నారు.ఆషాఢ ఆదివారాన్ని పురస్కరించుకొని అపార్ట్మెంట్ మహిళలు ఉదయాన్నే లేచి,ఇళ్లను శుద్ధి చేసుకొని అమ్మవారికి ఇష్టమైన ప్రత్యేక నైవేద్యాన్ని (బోనం) తయారు చేశారు. కొత్త కుండలకు పసుపు, కుంకుమలు అద్ది, వేప ఆకులతో అలంకరించి,జ్యోతిని వెలిగించారు.అనంతరం సకల శుభాలు కలగాలని కోరుకుంటూ, మంగళవాయిద్యాల నడుమ బోనాలను తలపైకెత్తుకొని ఊరేగింపుగా సమీపంలోని మారెమ్మ ఆలయానికి బయలుదేరారు. ఆలయానికి చేరుకున్న భక్తులు అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి,ధూపదీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.తమ కుటుంబాలను చల్లగా చూడాలని,ఆయురారోగ్యాలు ప్రసాదించాలని మొక్కులు చెల్లించుకున్నారు.

## గ్రామ దేవత సారగమ్మ నూతన విగ్రహ ప్రతిష్ట తీర్మానం



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** గ్రామాలను సంరక్షించే పొలిమేర దేవతలైన ఎల్లమ్మ, ముత్యాలపోచమ్మ , నల్లపోచమ్మ ,బద్ది పోచమ్మ, సారాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లను కొలిచిబోనాలు నైవేద్యంగా పెట్టేది ఆషాడ మాసం. నిర్మల్ జిల్లా ఖానాపూర్ తిమ్మాపూ ర్ గ్రామాభివృద్ధి కమిటీ సమావేశం ఆదివారం ముత్యాల పోచమ్మ ఆలయంలో నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులతో పాటు పట్టణంలో గల వివిధ పార్టీల నాయకులు కుల పెద్దలు పాల్గొని గ్రామ దేవత అయినా సార్గమ్మ అమ్మవారి పండుగ తో పాటు పట్టణ నడిబొడ్డులో సార్గమ్మ నూతన విగ్రహాన్ని ప్రతిష్టించాలని తీర్మానించారు.ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బిసి రాజన్న,కార్యదర్శి ద్యావతి రాజేశ్వర్,మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక మహేందర్, కౌన్సిలర్లు రాజురా సత్యం,నిమ్మల రమేష్,కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గౌర్రె గంగాధర్,ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం,మాజీ మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, మాజీ సర్పంచులు ఆకుల శ్రీనివాస్,బక్క శెట్టి లక్ష్మ ణ్,మార్కెట్ కమిటీ చైర్మన్ కల్వకుంట్ల నారాయణ,అల్లాడి వెంకటేశ్వర్లు,కొండాడి గంగారావు,కొత్తపల్లి సురేష్,కడకుంట్ల నర్సింలు,మధిరే సత్యనారాయణ, కొక్కుల ప్రదీప్, ఇస్తారు రాములు, దాసరి బాబన్న,నాగేందర్ రావు,శెట్టిశ్యాంసుందర్రావు, పరాంకుశం శ్రీనివాస్, భీమన్న, సీతారాం నాయక్, అడ్డగట్ల రాజన్న, బత్తుల నారాయణ,నరసయ్య,హిందూ ఉత్సవ కమిటీ అధ్యక్షులు మంత్రరాజం సురేష్,నరసయ్య, సీనియర్ పాత్రికేయులు సిరిపురం నాగరాజు,మంత్రరాజ్యం దేవేందర్, పాల్గొన్నారు.

## పోచమ్మకు బోనాలు సమర్పణ



**ప్రజాపక్షం/బోథ్ :** వర్షాలు కురవాలని ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండి పాడి పంటల సమృద్ధిగా పండాలని కోరుతూ రజక సంఘం ఆధ్వర్యంలో బోథ్ మండల కేంద్రంలో ఆదివారం పోచమ్మకు బోనాలు సమర్పించారు.

## చిరుత కళేబరానికి అంత్యక్రియలు



**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి :** రేంజ్ కార్యాలయంలో ఆదివారం రోజున అధికారుల సమక్షంలో చిరుత కలేబరానికి అంత్యక్రియలు నిర్వహించినట్లు ఎఫ్‌డీఓ చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కమ్మర్‌పల్లి రేంజ్ పరిధిలోని భీమ్‌గల్ మండలం తాళ్లపల్లి అటవీ ప్రాంతంలో లభ్యమైన చిరుత పలి కళేబరాన్ని కోర్టు ఆదేశాల మేరకు అంత్యక్రియలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సిద్ధార్థ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రత్యామ్నాయ ప్రణాళికపై సమావేశం

**ప్రజాపక్షం/నిజామాబాద్:** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రత్యామ్నాయ ప్రణాళికపై ప్రజాప్రతినిధులు, అధికారులు చర్చించి కీలక నిర్ణయాలు తీసుకునేందుకు వీలుగా సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో ఉదయం 10.45 గంటలకు ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు.

## గుండెనొప్పితో బాధపడుతూ గృహిణి ఆత్మహత్య

**ప్రజాపక్షం/ఎడపల్లి:** ఎడపల్లి మండల పరిధిలోని ఎంఎస్సి ఫారం గ్రామంలో ఓ గృహిణి ఆత్మహత్యకు పాల్పడిన విషాద సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రాకం స్వప్న(44) గత కొంతకాలంగా తీవ్రమైన గుండెనొప్పితో బాధపడుతోంది. పలుమార్లు చికిత్స చేయించుకున్నప్పటికీ నొప్ప తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి చెందింది. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లోని హాలులో ఉన్న సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమారుడు రాకం రామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



# గత ఏడాది పంట నష్టపరిహారం ఏది?

రైతు స్వరాజ్య వేదిక డిమాండ్

ఇన్‌చార్జ్ మంత్రి మాటలు వట్టివేనా?

ఏడాది గడిచినా అందని రూ. 10 వేల సాయం

**ప్రజాపక్షం/నేరడిగొండ:** గత సంవత్సరం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సంభవించిన తీవ్ర వరదల వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఇంతవరకు నష్టపరిహారం అందించలేదని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగేపు బొర్రన్న ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇన్‌చార్జ్ మంత్రి ఇచ్చిన హామీలు ఏడాది గడిచినా అమలుకు నోచుకోలేదని విమర్శించారు. గత ఏడాది పెనుగంగ, కుప్టి, కడెం నదులతో పాటు చీకుమాన్ ప్రాజెక్టు, త్రివేణి సంగమం, వడ్డాడి వాగు పరివాహక ప్రాంతాల్లో వచ్చిన భారీ వరదలకు వాణిజ్య పంటలు కొట్టుకుపోయాయి. జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా సేకరించిన వివరాల ప్రకారం.. జిల్లాలోని 434 గ్రామాల్లో 8,071 మంది రైతులకు చెందిన 20,608 ఎకరాల్లో పంట నష్టం జరిగింది.



ఇందులో పత్తి 15,103 ఎకరాలు, సోయాబీన్ 2,900, కందులు 1,845, మొక్క జొన్న 660, కూరగాయలు 100 ఎకరాల్లో పంట దెబ్బ తిన్నట్లు అధికారులు నివేదిక ఇచ్చారు. ఆ సమయంలో జిల్లాలో పర్యటించిన ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 10వేల చొప్పున పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారని బొర్రన్న గుర్తు చేశారు. కానీ ఏడాది గడుస్తున్నా ఆ నిధులు విడుదల కాలేదన్నారు. నేడు జిల్లాలో ఇన్‌చార్జ్ మంత్రి పర్యటన ఉన్నందున, గతంలో ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకుని రైతులకు తక్షణమే నష్టపరిహారం అందేలా చూడాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఆదివాసుల అస్తిత్వానికి టైగర్ జోన్ ముప్పు

**ప్రజాపక్షం/నేరడిగొండ:** కవ్వాల్ టైగర్ రిజర్వ్ జోన్ కారణంగా ఆదివాసుల అస్తిత్వానికి ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉందని రాయి సెంటర్ సార్ మేడి ఆత్రం గంగారం ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని లక్కంపూర్ గ్రామంలో ఆదివాసుల సమస్యలపై ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 32 గ్రామాల పటేళ్ల సారథ్యంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీచర గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీపూర్, తిమ్మాపూర్ గ్రామాలు కవ్వాల్ టైగర్ రిజర్వ్ పరిధిలో ఉండటంతో అక్కడి గిరిజనుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఎన్నో ఏళ్లుగా అక్కడే స్థిర నివాసం ఏర్పరచుకుని జీవనం సాగిస్తున్న ఆదివాసులను టైగర్ జోన్ పేరుతో ఫారెస్ట్ అధికారులు భయాందోళనలకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. అటవీ అధికారులు ఒత్తిళ్లతో గిరిజనులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ప్రభుత్వ నిర్ణయాల వల్ల ఆదివాసీ 9 తెగల



అస్తిత్వం ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడిందని సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశారు. తమ జాతి మనుగడను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ పోరాడాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని ఆదివాసీ సర్పంచులు, ఉద్యోగులు, మాజీ సర్పంచులు, గ్రామాల పెద్దలు, యువకులు, నాయకులు పాల్గొన్నారు.

# నకిలీ సందేశాలపై వ్యాపారస్తుతో జాగ్రత్త

**ప్రజాపక్షం/నిజామాబాద్:** మున్సిపల్ అధికారుల పేరుతో ట్రేడ్ లైసెన్స్ పీజు చెల్లించాలంటూ నకిలీ వాట్సప్ సందేశాలపై వ్యాపారస్తులు అప్రమత్తంగా ఉండాలని మున్సిపనర్ కమీషనర్ దిలీప్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నుంచి కొందరు సైబక్ నేరగాళ్లు 9492219684 వాట్సప్ ద్వారా నకిలీ సందేశాలను పంపుతున్నారని, మున్సిపల్ అధికారుల పేరుతో ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించాలంటూ ఒక క్యూర్ కోడ్‌ను కూడా ఆ మెసేజ్‌లో పంపుతున్నారన్నారు. ఈ నెంబర్ నుంచి వచ్చే సందేశాలు పూర్తిగా నకిలీవని ఇది ప్రజల సొమ్మును దోచుకునేందుకు సైబర్ ముఠాలు వేసిన పెద్ద వల అని అధికారులు స్పష్టం చేశారు. 9492219684 ఎలాంటి తెయని నెంబర్ల నుండి వచ్చే క్యూఆర్ కోడ్లను స్కాన్ చేసి డబ్బులు చెల్లించవద్దని ట్రేడ్ లైసెన్స్ ఫీజు ఇతర మున్సిపల్ పన్నుల చెల్లింపులకు సంబంధించి ఎలాంటి సందేహాలున్నా నేరుగా నగరపాలక సంస్థ కార్యాలయనికి వచ్చి అధికారులను వ్యక్తిగతంగా మాత్రమే సంప్రదించాలన్నారు. ప్రభుత్వ ఫీజులను కేవలం అధికారిక ప్రభుత్వ పోర్టల్స్ లేదా మున్సిపల్ కౌంటర్లలో మాత్రమే చెల్లించాలన్నారు. వాట్సప్ లింక్‌ల ద్వారా ఎలాంటి లావాదేవీలు చేయకూడదన్నారు. ఈ తరహా మోసపూరిత సందేశాలు ఎవరికైనా వస్తే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కి గానీ, స్థానిక పోలీసులకు గానీ సమాచారమందించాల్సిందగా కోరారు. నగరంలోని వ్యాపారస్తులు, ప్రజలు గమనించాలని, అప్రమత్తంగా ఉండాలని సైబర్ మోసాల బారిన పడవద్దన్నారు.

# వేతనాలు పెంచకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తాం

**ప్రజాపక్షం/నిజామాబాద్:** వేతనాలు పెంచకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ఎల్.పద్మ, ఎం.సుధాకర్ అన్నారు. ఆదివారం ప్రగతిశీల కేజీబీవీ నాన్‌టీచింగ్, వర్కర్స్ యూనియన్ (టియుసిఐ)ముఖ్య నాయకులతో జిల్లా జనరల్ బాడీ సమావేశం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ భవన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తలుగా వచ్చిన యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పద్మ, సుధాకర్ మాట్లాడారు. విపరీతంగా పెరిగిన ధరలు, రోజురోజుకు పెరుగుతున్న పని భారంతో కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్లు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్రమైన పనిభారంలో అనారోగ్యాలకు గురవుతూ ఉద్యోగాలు వదులుకుంటున్నారన్నారు. ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత, రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేకపోవటం అన్యాయమన్నారు. విద్యార్థుల సంఖ్య పెరుగతున్నా, ఉద్యోగుల సంఖ్య కుదిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేజీబీవీ, యుఆర్ఎస్, మోడల్ స్కూల్ హాస్టల్స్‌లో పని చేస్తున్న నాన్‌టీచింగ్ వర్కర్లకు సిఎం రేవంత్ రెడిడ్రపకటించిన కనీస వేతనాలు తక్షణమే అమలు చేయాలన్నారు. ఖాళీ పోస్టులతో, పనిభారం విపరీతంగా పెరిగిందన్నారు. వెంటనే ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలన్నారు. రిటైర్మెంట్ వయస్సు 65 సంవత్సరాలకు పెంచి, రిటైర్ అయిన వారికి 5 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. నాన్ టీచింగ్ వర్కర్లకు నూట్ డ్యూటీలను రద్దు చేయాలని, వీక్లీఫ్ సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని, ఛలో హైదరాబాద్ నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## సిపిఐ నుండి సిర్ర దేవేందర్ బహిష్కరణ

ముడుపు ప్రభాకర్ రెడ్డి




**ప్రజాపక్షం/ మావల:** సిపిఐ పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుండి సిర్ర దేవేందర్‌ను తొలగిస్తూ జిల్లా కార్యవర్గం ఏకగ్రీవంగా తీర్మానించిందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఆదివారం సిపిఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. ఈ నెల 14న జరిగిన సిపిఐ జిల్లా కౌన్సిల్, కార్యవర్గ సమావేశంలో మెజార్టీ సభ్యులు ఈ నిర్ణయానికి ఆమోదం తెలిపారని పేర్కొన్నారు. సిర్ర దేవేందర్ సిపిఐ పార్టీ, ఏఐటయూసీ కార్మిక సంఘంతో పాటు యువజన సంఘం పేరుతో అనేక అక్రమాలకు పాల్పడుతూ, డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వచ్చాయని, అవి రుజువయ్యాయని తెలిపారు. పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్నందున ఆయనను పార్టీ నుండి తొలగించాలని మెజార్టీ కౌన్సిల్ సభ్యులు డిమాండ్ చేశారన్నారు. ఘన చరిత్ర గల సిపిఐ పార్టీలో ఇలాంటి వారిని ఉంచకూడదనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. ఇప్పటి నుండి దేవేందర్‌తో సిపిఐ పార్టీకి ఎలాంటి సంబంధాలు ఉండవని, గ్రామాల్లోని శాఖ సభ్యులు, నాయకులు ఈ విషయాన్ని గమనించి అప్రమత్తంగా ఉండాలని ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు.

## సోనం వాంగ్‌చుక్ ఆమరణ నిరాహార దీక్షకు సంఘీభావం



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** ప్రముఖ సామాజిక కార్యకర్త సోనం వాంగ్‌చుక్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు సంఘీభావం ప్రకటిస్తూ సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ (ఆర్‌పిసి) రాష్ట్ర డైరెక్టర్,మాజీ న్యాయమూర్తి ఎం.ఏ. సలీం మరియు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ హైదర్ నాయకత్వంలో కమిటీ ప్రతినిధుల బృందం ఢిల్లీకి చేరుకుంది.ఈ సందర్భంగా కమిటీ నాయకులు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య పరిరక్షణ,పారదర్శక పాలన,ప్రజల హక్కుల సాధన కోసం శాంతియుతంగా జరుగుతున్న ఉద్యమాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. సోనం వాంగ్‌చుక్ చేపట్టిన దీక్ష విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ ఆయనకు సంఘీభావం ప్రకటించారు.ప్రజా సమస్యల పరిష్కారం,సమాచార హక్కు చట్టం సమర్థవంతమైన అమలు, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం కమిటీ నిరంతరం కృషి చేస్తుందని వారు పేర్కొన్నారు.కమిటీకి చెందిన పలువురు సభ్యులు కూడా పాల్గొన్నారు.

## బ్రహ్మపురి ఆధ్వర్యంలో ఆకుల హరీష్ కుమార్ ఘన సన్మానం

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ కాంగ్రెస్ పార్టీ నూతన పట్టణ అధ్యక్షులుగా ఎన్నికైన ఆకుల హరీష్ కుమార్ ని బ్రహ్మపురికి చెందిన శ్రీ శివ మున్నూరు కాపు సంఘం సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు.సంఘం అధ్యక్షులు జాప నారాయణ, కార్యదర్శి మిర్యాల సత్యనారాయణ,ఉపాధ్యక్షులు నలిమేల పోశెట్టి, సంయుక్త కార్యదర్శి జాప అనిల్,కోశాధికారి జాప శ్రీకాంత్ పాటు సంఘ కార్యవర్గ సభ్యులు సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆకుల హరీష్ కుమార్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆకుల హరీష్ కుమార్ తమపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలుపుతూ,ప్రజల ఆశయాలకు అనుగుణంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి,పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.



## అర్హులందరూ గృహజ్యోతి పథకాన్ని వినియోగించుకోవాలి

**ప్రజాపక్షం/పెగడపల్లి :** మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం (200 యూనిట్ల ఉచిత విద్యుత్) పెగడపల్లి మండలం పరిధిలోని అర్హులైన లబ్ధిదారులందరికీ అందేలా చూడటమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నాయి. మండలంలో ఎవరికైనా ఈ పథకం వర్తించకపోతే, వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించాలని పెగడపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కడారి తిరుపతి ఒక ప్రకటనలో కోరారు. గ్రామాల్లో గృహజ్యోతి పథకం లబ్ధి పొందని అర్హులు ఎవరైనా ఉంటే,వారు వెంటనే కింద పేర్కొన్న పత్రాలతో తమ పరిధిలోని విద్యుత్ సబ్ స్టేషన్ అధికారులను సంప్రదించాలని ఆయన సూచించారు. సమర్పించాల్సిన పత్రాలు ఆధార్ కార్డు జిరాక్స్, రేషన్ కార్డు (ఆహార భద్రత కార్డు) జిరాక్స్,కరెంట్ బిల్లు ఈ పత్రాలను సంబంధిత సబ్ స్టేషన్‌లో అందజేస్తే సమస్యను వెంటనే పరిష్కరిస్తారని, తద్వారా తదుపరి నెలల నుండి ఉచిత విద్యుత్ సౌకర్యం అందుతుందని ఆయన వివరించారు. ఉచిత విద్యుత్ రాని అర్హులైన లబ్ధిదారులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కడారి తిరుపతి పిలుపునిచ్చారు.

## బహుజనులంతా సంఘటితం కావాలి

### మహనీయుల స్ఫూర్తితో ఉద్యమిద్దాం

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** తెలంగాణలోని బహుజానులంతా సంఘటితం కావాలని బహుజన సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు తగరం శంకర్ లాల్ పిలుపునిచ్చారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ 1902 లోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు ఛత్రపతి సాహు మహారాజ్ 50 శాతం రిజర్వేషన్లు అమలు చేశారని గుర్తు చేశారు. నేటి పాలకులు 80 శాతం పైగా ఉన్న బహుజన వర్గాలకు రిజర్వేషన్లు సరిగా అందకుండా చేస్తూ వారిని దేశ సంపదకు దూరం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఛత్రపతి సాహు మహారాజ్, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తితో అణగారిన వర్గాలకు న్యాయం జరిగేలా ఉద్యమానికి మద్దతుగా నిలవాలని ప్రజలను కోరారు. ఛత్రపతి సాహు మహారాజ్ జయంతి సందర్భంగా బహుజన సేన ఆద్వర్యంలో హైదారాబాద్ బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 26న నిర్వహించే సదస్సుకు ప్రజాస్వామిక వాదులు, బహుజన సంఘాల నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. అంతకుముందు సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు నోమూరి శ్రీధర్,నూనె కుమార్, ఆసం తిరుపతి, కట్కూరి సందీప్, గద్దల శంకర్, సంకెనపల్లి లక్ష్మణ్, బి. లక్ష్మణ్, లింగంపల్లి శంకర్, రాగమల్ల మధుకర్, దొడ్ల రమేష్, కోల శ్రీనివాస్, నల్లవెల్లి శంకర్,కంకటి లింగమూర్తి,తదితరులు పాల్గొన్నారు.



## వడ్డెర సంఘం నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**ప్రజాపక్షం/ఎల్కతుర్తి:** తెలంగాణ వడ్డెర సంఘం హుస్నాబాద్ నియోజకవర్గ అధ్యక్షులు బొంత రమేష్ అధ్యక్షతన ఆదివారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో మండల వడ్డెర సంఘం సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి అయిలమల్లు ముఖ్య అతిథిగా హాజరై మండలంలోని అన్ని గ్రామాల కుల పెద్దల సమక్షంలో నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించి నియామక పత్రాలు అందజేశారు.నూతన మండల అధ్యక్షుడిగా గొల్లెన ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా అల్లెపు ప్రశాంత్, కోశాధికారిగా అల్లెపు రాజు , ఉపాధ్యక్షులుగా బొంత కుమారస్వామి, ఆలకుంట సమ్మయ్య, కార్యదర్శులుగా శివరాత్రి బిక్షపతి, గండికోట రాము, సహాయ కార్యదర్శులుగా వల్లపు సాంబరాజు,గండికోట జంపయ్య, ఎల్కతుర్తి పట్టణ అధ్యక్షుడిగా ఓర్సు కుమారస్వామి , మండల యూత్ ఇన్‌చార్జిగా బొంత అర్జున్, ఏకగ్రీవంగా నియమితులయ్యారు.అనంతరం జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి అయిలమల్లు మాట్లాడుతూ ఎల్కతుర్తి మండలంలో మూడు వేలకుపైగా వడ్డెరలు నివసిస్తున్నారని వారి హక్కుల పరిరక్షణ సంక్షేమం అభివృద్ధి కోసం అందుబాటులో ఉండే విధంగా బలమైన మండల కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.వడ్డెర సంఘం ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా పరిశీలించి సంఘం ఎన్నో ఏళ్లుగా కోరుతున్న న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా గౌరవ అధ్యక్షురాలు శివరాత్రి రాజమ్మ, రాష్ట్ర కోశాధికారి గుర్రం శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు వల్లెపు సమ్మయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సూర రవీందర్, వల్లపు వెంకన్న, వివిధ గ్రామాల కుల పెద్దలు సంఘ నాయకులు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## హనుమకొండలో ఘనంగా ఒబిసి ఆత్మీయ సన్మాన సభ




**ప్రజాపక్షం/హనుమకొండ :** హనుమకొండ హంటర్ రోడ్ లోని మాస్టర్ జీ కళాశాల ఆడిటోరియంలో కూడా మాజీ చైర్మన్, ఓబీసీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ అధ్యక్షతన బీసీ నాయకుల ఆత్మీయ సన్మాన సభ ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా తెలుగుఅకాడమీ చైర్మన్ వెంకటనారాయణ, మేరా సహకార సంఘాల కార్పొరేషన్ చైర్మన్ వెంకటరాజం లను సన్మానించి అభినందనలు తెలిపారు.ముఖ్యఅతిథులుగా శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, ఎమ్మెల్సీ సారయ్య, మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ హాజరయ్యారు.పెద్దసంఖ్యలో బిసిలు, బీసీ ప్రజాప్రతినిధులు,మేధావులు, సామాజికవేత్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి కులాల లెక్క లేదని,కమిషన్లు చెప్పిన అంశాలను తుంగలో తొక్కారన్నారు.బీసీల కోసం ఏనాడు ప్రభుత్వాలు ఆలోచించలేదని,బీసీలను అణగదొక్కడమే లక్ష్యంగా ఆధిపత్య కులాలు పనిచేస్తున్నాయన్నారు. మెజారిటీ బీసీలకు మంత్రిత్వ శాఖ లేకుండా అణచివేఆధిపత్య కులాలు, వాళ్ళ వారసులే ఉన్న స్థానాల్లో ఉన్నారన్నారని,గ్లోబలైజేషన్ కారణంగా నష్టపోయింది బీసీ కులాలేనని,42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందిందన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, ఓబిసి జనరల్ సెక్రెటరీ, ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, బిజెపి రాష్ట్ర నాయకులు డాక్టర్ కాళీ ప్రసాద్, మాజీ జెడ్పీ చైర్మన్ సాంబారి సమ్మారావు,పాల్గొన్నారు.

## విజయవంతంగా నిఖిల్ మారథాన్



**ప్రజాపక్షం/హనుమకొండటౌన్:** తెలంగాణ సంస్కృతి, చారిత్రక వారసత్వాన్ని ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు ఫిట్‌నెస్‌పై అవగాహన పెంచే లక్ష్యంతో గుంజేడు నుండి ఏకశిల పార్కు వరకు రన్ చేసినట్టు నిఖిల్ తెలిపాడు. ఆయన తన యాత్రను పూర్తి చేసిన అనంతరం ఏకశిలా పార్కు లో పర్యాటక శాఖ అధికారులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ములుగు జిల్లాకు చెందిన గిరిజన యువకుడు, ఎన్ఐటీ కాలికట్ విద్యార్థి, ఎండ్యూరెన్స్ స్పోర్ట్స్ లో పాల్గొంటున్న నిఖిల్ కుమార్ ఆదివారం నాడు తన హెరిటేజ్ రన్ ను విజయవంతంగా పూర్తి చేశాడు అని పర్యాటక శాఖ అధికారులు తెలిపారు.జూలై 17 అర్ధరాత్రి 12 గంటలకు గుంజేడు ముసలమ్మ ఆలయం నుంచి తన రన్ ప్రారంభించి 70 కిలోమీటర్ల హెరిటేజ్ రన్, ఉదయం 10 గంటలకు హనుమకొండలోని ఏకశిలా పార్కు వద్ద ముగించారు. ఈ హెరిటేజ్ రన్ ద్వారా తెలంగాణ పర్యాటక వైభవాన్ని దేశవ్యాప్తంగా చాటడంతో పాటు యువతలో ఫిట్‌నెస్, ఆరోగ్యకరమైన జీవనశైలిపై చైతన్యం కల్పించాలనే సంకల్పంతో ఈ ప్రయత్నం చేశానని నిఖిల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్య కిరణ్, లోకేష్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## అనుభవాల జ్ఞాన సంపదే సీనియర్ సిటిజన్స్




**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** సీనియర్ సిటిజన్స్ అంటే అనేక అనుభవాల జ్ఞాన సంపద అని కాజీపేట ఏసిపి ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఆదివారం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హనుమకొండ ఆధ్వర్యంలో గోపాలపురంలో ఏర్పాటుచేసిన 4వ మహాజన సభకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తూ తమ జీవితంలో ఇప్పటివరకు ఎన్నో కష్టనష్టాలను అనుభవించి సుఖ శాంతులతో గడపాల్సిన తరుణంలో సామాజ సేవలో పాల్గొనడం గొప్ప విషయమని అన్నారు. సీనియర్ సిటిజన్స్ సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానని అన్నారు. తెలంగాణ సీనియర్ సిటిజన్స్ కాన్ఫెడరేషన్ హైదరాబాద్ అధ్యక్షులు రామచంద్రయ్య మాట్లాడుతూ.. వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా నిలబడాలని అన్నారు. కే యూ రిటైర్డ్ ప్రొఫెసర్ సుజాత మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ సంస్థలలో మహిళలపాత్ర పెరగాలని అన్నారు. వృద్ధుల్లో పురుషులకంటే మహిళలే ఎక్కువగా ఇబ్బందులనిదుర్కొంటున్నారని అన్నారు. కార్యక్రమానికి సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, రిటైర్డ్ డిఎస్పి దామెర నర్సయ్య అధ్య క్షత వహించగా కార్యదర్శి తేరాల యుగంధర్, ఉపాధ్యక్షులు నాగులగాం నర్సయ్య, వరంగల్ సంస్థ అధ్యక్షులు మల్లారెడ్డి, పరకాల అధ్యక్షులు రేపాల నరసింహారాములు, చెన్నారావుపేట అధ్యక్షులు, త్యనారాయణ, ములుగు కార్యదర్శి భూమ రెడ్డి, ప్రేరణ సంస్థ అధ్యక్షులు పెండ్లి ఉపేందర్ రెడ్డి మాట్లాడారు. సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

## ఘనంగా పోచమ్మ తల్లి బోనాలు



**ప్రజాపక్షం/జగిత్యాల :** జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆషాఢ మాసం ఆదివారం పురస్కరించుకుని పోచమ్మ తల్లి బోనాల పండుగను భక్తులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా కేంద్రంలోని పోచమ్మ వాడ, వాణి నగర్ లో మహిళలు ఇంటికో బోనం నెత్తిన ఎత్తుకుని బారి ఊరేగింపు నిర్వహించారు.జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.పోచమ్మ తల్లి కృపాకటాక్ష ప్రజలందరిపై ఉండాలని కోరారు. యువతీ, యువకులు డీజే చప్పులతో సంప్రదాయ నృత్యాలు చేస్తూ సందడి చేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అయిల్నేని వెంకటేశ్వరరావు,కౌన్సిలర్ పిట్ట ధర్మరాజు,నాయకులు లైశెట్టి వెంకన్న తాడేపు మహేష్ ,దేవన్న,సత్తన్న,తాడేపు వెంకట రమణ, కస్తూరి గంగాధర్,ప్రభాకర్,శ్రీనివాస్,దయాకర్,తదితరులు ఉన్నారు.

## మృతురాలి కుటుంబానికి పరామర్శ

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని కేశనపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకుడు మంథని రాజేశం తల్లి ఇటీవలే అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ముత్తారం మండల మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు నూనె కుమార్, ఇతర బిఆర్ఎస్ నాయకులతో కలిసి ఆదివారం రాజేశం కుటుంబాన్ని పరామర్శించారు.మృతురాలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, తమ గాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ పరామర్శించిన వారిలో పలువురు మండల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## లయన్స్ క్లబ్ సాయం: బాధితుడికి కృత్రిమ కాలు అందజేసిన ఎంపీ



**ప్రజాపక్షం/ముత్తారం :** గోదావరిఖని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన మోత్కూరి స్వామి అనే వ్యక్తికి కృత్రిమ (ప్లాస్టిక్) కాలును అందజేశారు.గతంలో జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో స్వామి ఒక కాలును పూర్తిగా కోల్పోయారు.ఈ విషయం తెలుసుకున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు బాధితుడికి సాయం చేయడానికి ముందుకు వచ్చారు.పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై, బాధితుడు మోత్కూరి స్వామికి తన చేతుల మీదుగా ఈ కృత్రిమ కాలును అందజేశారు. కాలు కోల్పోయి నడవలేని స్థితిలో ఉన్న తనకు లయన్స్ క్లబ్, ఎంపీ వంశీకృష్ణ మానవతా దృక్పథంతో స్పందించి సాయం చేయడంపై బాధితుడు స్వామి భావోద్వేగానికి లోనయ్యారు.ఈ సందర్భంగా ఆయన ఎంపీ గడ్డం వంశీకృష్ణకు, లయన్స్ క్లబ్ ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నిర్వాహకులు,స్థానిక నాయకులు పాల్గొన్నారు.